సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



నీరు నిలవకుండా..
జిల్లాలోని పలుచోట్ల గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేశారు.
- 9లో ▸



ఇంటర్ విద్య కీలకం
విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకమని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పేర్కొన్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.3 /22.4

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బాన్సువాడ సబ్‌కలెక్టర్‌గా కిరణ్మయి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కిరణ్మయి కొప్పిసెట్టిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవలే బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పోస్టును అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ కిరణ్మయి కొప్పిసెట్టికి బాన్సువాడ తొలి సబ్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

బోధన్‌కు వికాస్ మహతో..
బోధన్: బోధన్ సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి వికాస్ మహతో నియమితులయ్యారు. ఆయన 2022 ఐఏఎస్ బ్యాచ్ అధికారి.

డీఏవో భాగ్యలక్ష్మి బదిలీ



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి కరీంనగర్ డీఏవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నిజామాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీడీఏగా విధులు నిర్వహిస్తున్న తిరుమల ప్రసాద్ రానున్నారు. బదిలీపై వెళ్తున్న డీఏవో భాగ్యలక్ష్మిని గురువారం వ్యవసాయ అధికారులు, టీఎస్జీవోస్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి సాయిలు, జిల్లా అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం, ప్రతినిధులు నాగరాజు, సంతోష్ కుమార్, నర్సింలు, ఏవోలు, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రం ఏడీఏ బదిలీ



నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్ర ఏడీఏ వీరాస్వామి బదిలీ అయ్యారు. మాల్తుమ్మెదలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న ఆయనను నిజామాబాద్ అర్బన్ ఏడీఏగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విత్తనోత్పత్తి క్షేత్ర ఏవో హరివెంకట ప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. హరివెంకట ప్రసాద్‌కు నాగిరెడ్డిపేట మండల వ్యవసాయ అధికారి బాధ్యతలు కూడా ఉండడం గమనార్హం.

డీసీసీబీలో రూ.169.73 కోట్ల రుణమాఫీ



సుభాష్‌నగర్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) పరిధిలోని 143 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో గల 40,654 మంది రైతులకు మూడు విడతల్లో రూ.169.73కోట్ల మేర రుణమాఫీ జరిగిందని చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం నిజామాబాద్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ అనంతరం ఉమ్మ డి జిల్లాలకు కలిపి సుమారు రూ.75కోట్ల వ రకు తిరిగి పంట రుణాలు మంజూరు చేశామన్నారు. బ్యాంకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. రుణమాఫీ పొందని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ అధికారులు తగిన సూచనలు చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టాపాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌ను అధికారులకు అందించాలని సూచించారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కొనసాగుతున్న నిరసన



కామారెడ్డి టౌన్: డిమాండ్‌ల సాధన కోసం ఆరోగ్యశ్రీ ఉద్యోగులు చేపట్టిన నిరసన గురువారం కొనసాగింది. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద కూడా ఉద్యోగులు నిరసన తెలిపారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, డీపీవో క్యాడర్‌గా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్, ఆరోగ్యమిత్రలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రణం!



జిల్లాకేంద్రంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పక్కన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు
- ఆందోళనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు
- షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలని డిమాండ్

పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ నేతలు రోడ్డెక్కారు. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించిన ధర్నాలలో మాజీ ఎమ్మెల్యేలు పాల్గొని సర్కారు తీరును ఎండగట్టారు. షరతులు లేకుండా రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలు విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షలలోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో పార్టీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎల్లారెడ్డి పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ నియోజక వర్గంలోని బిచ్కుందలో జరిగిన ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో జరిగిన కార్యక్రమాలలో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు పాల్గొన్నారు. అన్ని మండల కేంద్రాలలో ఆందోళనలు కొనసాగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను వంచిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో అందరి రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కొర్రీలతో సగం మందికి కూడా మాఫీ చేయలేదని ఆరోపించారు. ఆంక్షలు లేకుండా రైతులందరి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరి పంట రుణాలను మాఫీ చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉత్సాహంగా పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రైతులందరి పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టిన ఆందోళనల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఉత్సాహంతో పాల్గొన్నాయి. అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ ఓడిపోవడం, తర్వాత పలువురు ప్రజాప్రతినిధులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడంతో శ్రేణులు కొంత డీలాపడ్డాయి. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో మరింత నిరుత్సాహానికి గురయ్యారు. పార్టీ కార్యక్రమాలు కూడా లేకపోవడంతో కార్యకర్తల్లో స్తబ్ధత పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో రుణమాఫీ అంశం ఆ పార్టీకి కలిసొచ్చింది. అధికారంలోకి వస్తే రైతులకు సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక రుణమాఫీలో పలు కొర్రీలు విధించింది. దీంతో చాలా మంది అప్పులు మాఫీ కాలేదు. అన్ని అర్హతలున్నా రుణ మాఫీ కాకపోవడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. అధికారులను నిలదీస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ ఆందోళనలకు పిలుపునిచ్చింది. రైతుల సమస్య కావడంతో గురువారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలు విజయవంతమయ్యాయి. దీంతో గులాబీ దళంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నాం



మాట్లాడుతున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, వేదికపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

- చెరుకు సాగును ప్రోత్సహిస్తాం
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మాగి గాయత్రి చక్కెర కార్మాగారం ఆవరణలో సీడీసీ చైర్మన్‌గా ఎండీ షాదుల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేశారన్నారు. కొన్ని కారణాలతో కొందరు రైతులకు మాఫీ కాలేదని పేర్కొన్నారు. రైతుల ముసుగులో బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేయడం తగదన్నారు. మాగి గాయత్రి కార్మాగారానికి నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద దిక్కుగా నిలుస్తోందన్నారు. కార్మాగారానికి 70 శాతం చెరుకు నారాయణఖేడ్ నుంచే వస్తోందన్నారు. రైతులను యాజమాన్యం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా, చెరుకు సాగులో ఆధునిక టెక్నాలజీ వినియోగించుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతుల పేరిట యాజమాన్యం తీసుకున్న రుణాలతో రైతులకు నష్టం జరుగకుండా చూడాలన్నారు. చెరుకు సాగును ప్రోత్సహిస్తామని, అన్ని మండలాల్లో 10 వేల ఎకరాలకు తగ్గకుండా చెరుకు సాగు చేసేలా చూస్తామని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాగి గాయత్రి కార్మాగారం వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, కేన్ మేనేజర్ వెంగళ్‌రెడ్డి, నాయకులు జయప్రదీప్, ప్రజా పండరి, బాల్‌సాయిలు, నరసింహారెడ్డి, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన



పిట్లం: అన్నారం గ్రామంలో నీటి సమస్య తీర్చాలంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 15 రోజులుగా ఎస్సీ కాలనీకి నీళ్లు రావడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సామాజిక వివాదాల పరిష్కారానికి కృషి

- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే
- కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణను వర్చువల్‌గా ప్రారంభించిన న్యాయమూర్తి



వర్చువల్ విధానంలో శిక్షణను ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జడ్జీలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి : సామాజిక వివాదాల సత్వర పరిష్కారంలో కమ్యూనిటీ మీడియేటర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. గురువారం జిల్లా కోర్టులోని డీఎల్ఎస్ఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని కమ్యూనిటీ మీడియేటర కు శిక్షణ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తొలిసారిగా 2021లో కమ్యూనిటీ మీడియేటర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో రాష్ట్రంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. వివిధ సామాజిక వర్గాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ప్రారంభించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24 వరకు శిక్షణ తరగతులు వర్చువల్ విధానంలో కొనసాగనున్నాయి. ఈ శిక్షణను హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే వర్చువల్‌గా ప్రారంభించగా, హైకోర్టు న్యాయమూర్తులు సుజోయ్ పాల్, కె సురేందర్, జె శ్రీనివాస్‌రావు భాగస్వాములయ్యారు. జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ సామాజిక వివాదాలు, కుటుంబ తగాదాలు వంటి వాటిని కమ్యూనిటీ మీడియేటర్లు (వలంటీర్లు) మధ్యవర్తిత్వం ద్వారా ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దీంతో కక్షిదారులకు అనవసర ఖర్చులు తగ్గుతాయన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనేందుకు కూడా ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన వలంటీర్లు తమ ప్రాంతాల్లో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని, పరస్పర ఆమోదయోగ్యమైన రీతిలో వివాదాల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి లీగల్ సెల్ రాష్ట్ర అథారిటీ మెంబర్ సెక్రెటరీ, జడ్జి పంచాక్షరీ, జిల్లా జడ్జి సునీత మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ రిసోర్స్ పర్సన్, రిటైర్డ్ సెషన్స్ జడ్జి మొహమ్మద్ షమీమ్, కామారెడ్డి సెషన్స్ జడ్జి వీఆర్ఆర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల రెన్యువల్‌ను వేగవంతం చేయాలి

- రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం : పంట రుణాల రెన్యువల్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో రుణమాఫీ పొందిన ప్రతి రైతుకు పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలన్నారు. ఇప్పటివరకు ఎస్‌బీఐ సహా ఇతర బ్యాంకుల్లో పంట రుణాల రీషెడ్యూల్ తక్కువగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా రెన్యువల్స్ చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, మహిళా శక్తి రుణాల మంజూరులో పలు బ్యాంకులు వెనకబడి ఉన్నాయన్నారు. మహిళలకు రుణాల మంజూరుకు సహకరించాలని బ్యాంకర్లకు సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 7,087 మంది రైతులు రుణమాఫీ కాలేదని దరఖాస్తు చేసుకున్నారన్నారు. రుణమాఫీ కాని లక్ష, లక్షన్నర, రెండు లక్షలలోపు, రెండు లక్షలపైన క్రాప్‌లోన్ తీసుకున్న రైతుల వివరాలను గ్రామాలు, బ్యాంకుల వారీగా నమోదు చేసి ఆన్‌లైన్ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు క్రమం తప్పకుండా ఎరువుల లభ్యత, నిల్వలను పరిశీలించాలన్నారు. మరణించిన రైతు కుటుంబాలకు త్వరగా బీమా డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఈ ఏడాది 2 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం తోటల పెంపకం లక్ష్యం కాగా.. ఇప్పటివరకు 457 ఎకరాలకు మంజూరు లభించిందన్నారు. ఇందులో 275 ఎకరాల్లో మాత్రమే ఆయిల్‌పాం సాగు చేస్తున్నారన్నారు. ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించి లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారి జ్యోతిని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 69 మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి ఆంజనేయస్వామికి సూచించారు. జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందడానికి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్‌కు సూచించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, ఎల్‌డీఎం రవికాంత్, బ్యాంకర్లు, వ్యవసాయ, హార్టికల్చర్, పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురోగతి సాధించాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో పురోగతి సాధించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో మహిళా శక్తి కార్యక్రమంపై అధికారులతో సమావేశమయ్యారు. బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో వెనకబడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలాల వారీగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి పురోగతికి చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాడి, పెరటి కోళ్ల పెంపకం లక్ష్యాలను సాధించాలన్నారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లను ప్రోత్సహించాలన్నారు. ఆయా అంశాలలో ప్రగతిపై రోజూ నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలో 20 రోజుల్లో 5 మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, డీపీఎంలు రవీందర్‌రావు, సుధాకర్, రమేశ్ బాబు, వకుళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో నాలాల కబ్జా

- అస్తవ్యస్తంగా మురికి కాలువలు.. ఎక్కడికక్కడే నిలిచిపోతున్న నీరు
- వర్షం పడితే చెరువులను తలపిస్తున్న పట్టణ రోడ్లు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో నాలాలను యథేచ్ఛగా కబ్జా చేశారు. ప్రధాన రోడ్లపై ఇరువైపులా ఉన్న మురికి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో మురికి కాలువల్లో చెత్తను కార్మికులు తొలగించలేకపోతున్నారు. వర్షం కురిసినప్పుడు నీరు కాలువల్లోకి వెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి ప్రధాన రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారి సమస్య ఉత్పన్నమవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఆక్రమణలతో ఇబ్బందులు..
పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా నుంచి జన్మభూమి రోడ్ వరకు, కొత్త బస్టాండ్ నుంచి హౌసింగ్ బోర్డు వరకు, ప్రియాడీలక్స్‌రోడ్, పాత బస్టాండ్, సిరిసిల్లరోడ్, పొట్టి శ్రీరాములు విగ్రహం వెనకాల, జేపీఎన్ రోడ్, సుభాష్‌రోడ్, మాయాబజార్, స్టేషన్‌రోడ్, విద్యానగర్ కాలనీ, సాయిబాబారోడ్, మున్సిపాలిటీ ముందు భాగంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న మురికి కాలువలపై వ్యాపారులు స్లాబ్‌లు వేశారు. స్టేషన్‌రోడ్‌లో ఇరువైపులా మురికి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలిచిపోతోంది. సుభాష్‌రోడ్‌లో వ్యాపారులు నాలాలను కబ్జా చేయడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. భారీ వర్షం కురిసిన ప్రతిసారి రోడ్లపై మోకాలి లోతు వరకు నీరు నిలుస్తుండడంతో వాహనదారులతో పాటు పాదచారులూ ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతోంది. కబ్జాలు కనిపిస్తున్నా బల్దియా పాలకులు గానీ, అధికారులుగానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నాలాలపై కబ్జాలను తొలగించాలని, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సిరిసిల్లరోడ్‌లో స్లాబ్ వేసి డ్రెయినేజీ ఆనవాళ్లు లేకుండా చేసిన దృశ్యం



స్టేషన్ రోడ్‌లో మురికి కాలువ లేకపోవడంతో రోడ్డుపైన నిలిచిన నీరు



నిజాంసాగర్ రోడ్‌లో అధ్వానంగా ఉన్న మురికి కాలువ



ఇటీవల కురిసిన వర్షానికి చెరువులా మారిన నిజాంసాగర్ రోడ్

సమస్యను పరిష్కరిస్తాం

ప్రధాన రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నాం. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. నాలాలను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం. పట్టణంలోని సమస్యలపై కౌన్సిల్‌లో చర్చించి, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. – సుజాత, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

క్లుప్తంగా

ఆర్‌బీవీఆర్‌ఆర్ సేవలు మరువలేనివి



కామారెడ్డి టౌన్ : రెడ్డి సామాజిక వర్గానికి సేవలు చేసిన రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగించాలని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విద్యా పరిషత్ ట్రస్టు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగర్తి చంద్రారెడ్డి అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో జయంతిని నిర్వహించారు. జిల్లాలో రెడ్డి సామాజిక వర్గానికి అందుబాటులో ఉండేందుకు రెడ్డి పాఠశాల హాస్టల్ సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 1న సమావేశం నిర్వహించి సెప్టెంబర్ 15న జిల్లాస్థాయి సర్వసభ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షులు సంతోష్ రెడ్డి, జిల్లా నాయకులు కొప్పుల గంగారెడ్డి, మల్లారెడ్డి, భీమ్ రెడ్డి, రామ్ రెడ్డి, రమేష్ రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి నేత ప్రవీణ్ గౌడ్ మృతి



బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి చెందిన బీసీ విద్యార్థి నేత గడ్డమీది ప్రవీణ్‌గౌడ్(40) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందారు. కొంత కాలంగా కిడ్నీ, లివర్ సమస్యతో బాధ పడుతున్న ఆయన రెండు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచాడు.

బీసీ విద్యార్థి నేతగా ప్రవీణ్ గౌడ్ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఈనెల 22న 'సాక్షి'లో 'చావుతో పోరాడుతున్న ఉద్యమ నేత' శీర్షికతో కథనం ప్రచురితం కాగా ఆయన చికిత్స కోసం పలువురు విరాళాలు అందజేశారు. బాన్సువాడకు చెందిన వ్యాపారవేత్త మెరిల్ శ్రీనివాస్‌రావు రూ. 50 వేల ఆర్థికసాయం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ బాడి శ్రీనివాస్ రూ. 5 వేలు, వేద పండితులు సుదర్శన స్వామి జపాల భాస్కరశర్మ ఆర్థికసాయం చేశారు. బాన్సువాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ. 80 వేల సాయం ప్రవీణ్‌గౌడ్ కుటుంబానికి అందజేశారు.

రైతులను నిండా ముంచారు

- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల వ్యాఖ్యలు
- నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు



కామారెడ్డి పట్టణంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం : ఎన్నికలకు ముందు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక కొర్రీలు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విమర్శించారు. ప్రతి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ జరిగే దాకా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. అప్పటి దాకా కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ సభలో రేవంత్‌రెడ్డి ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రస్తుతం పూటకో మాట మారుస్తున్నారన్నారు. నా సొంత గ్రామం బస్వాపూర్‌లో 2 వేలకు పైగా మంది రైతులకు రూ.10.50 కోట్లు రుణమాఫీ జరగాల్సి ఉండగా కేవలం రూ.3.21 కోట్లు మాత్రమే మాఫీ వచ్చిందన్నారు. కామారెడ్డి సింగిల్‌విండో పరిధిలో 2,418 మంది రైతులకు గాను కేవలం 791 మంది రైతులకు రుణాలు మాఫీ అయ్యాయన్నారు. రుణ మాఫీ ఒక్కటే కాకుండా మహిళలకు రూ.2500, రూ.4 వేల పింఛన్, రేషన్‌కార్డులు, ఇళ్ల తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నాయకులు పిప్పిరి అంజనేయులు, గోపిగోడ్, కుంభాల రవి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తెలంగాణ జాగృతి అధ్యక్షుడు అనంతరాములు, భూంరెడ్డి, క్రిష్ణాజీరావు, ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

మాఫీ అయ్యేవరకు పోరు ఆగదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద/మద్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేసేవారకు బీఆర్‌ఎస్ పోరు ఆగదని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. గురువారం బిచ్కుంద, మద్నూర్ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారన్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్ ఇస్తే ప్రస్తుతం 8 గంటలు కూడా రావట్లేదన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఇప్పటి దాకా ఒక్క రోడ్డుకు కూడా జీవో తేలేదన్నారు. బిచ్కుందలో సెంట్రల్‌లైటింగ్ పనులు నా హయాంలో మంజూరు చేసి చేయిస్తే ప్రస్తుత ఎమ్మెల్యే రెండోసారి అవే పనులకు శంకుస్థాపన చేయడమేమిటన్నారు. నియోజకవర్గంలో ఏ మండలం ఎక్కడ ఉందో ప్రస్తుత ఎమ్మెల్యేకు తెలియదన్నారు. మాజీ ఎంపీపీ అశోక్ పటేల్, సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలాజీ, నాయకులు నాల్చర్ రాజు తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి : రైతుల రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన ధర్నా, రాస్తారోకోలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలను చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మాఫీ చేయక పోవడంతో హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు రుణమాఫీ చేసిన పక్షంలో రాజీనామా చేస్తానని దేవుళ్లపై ఒట్టు పెట్టి నేడు ఆచరించక పోవడం హేయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, రాజేశ్వర్‌రావు, కపిల్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ : దేశంలో ఇంతటి ఘోరమైన ప్రభుత్వాన్ని చూడలేదని, తెలంగాణలో చంద్రబాబు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బాన్సువాడలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రైతు ధర్నా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పంటలకు రైతుబంధు ఇస్తే ఇదే సీఎం రేవంత్‌రెడ్డి మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసి ఇప్పుడు ఒక్క పంటకు కూడా రైతు భరోసా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. కేసీఆర్‌ను, ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే పోచారంనకు ప్రజలే బుద్ధి చెబుతారని బాజిరెడ్డి పేర్కొన్నారు. 2018లో స్పీకర్ పదవి ఉచి నిధులు ఇస్తే తిమ్మాపూర్ వెంకన్న ఆలయంలో జీవితాంతం బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్‌కు మాటిచ్చి నేడు మాటతప్పి కాంగ్రెస్‌లో పోచారం చేరాడని విమర్శించారు. బాన్సువాడ పట్టణంలో సెంట్రల్ లైటింగ్, బీర్కూర్, పాతంగల్ వంతెనలు తన హయాంలో చేసినవేనన్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆధునీకరణ కోసం దివంగత సీఎం వైఎస్ఆర్ కృషితో రూ.524 కోట్లు మంజురు చేసి కాలువ మరమ్మతు పనులు చేసినట్లు గుర్తు చేశారు. త్వరలో బాన్సువాడకు కేటీఆర్ వస్తానన్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, మాజీ వార్డు సభ్యులు మోచీ గణేష్, మాజీ సర్పంచి సుధాకర్ తదితరులున్నారు.

నోటిఫికేషన్ రాకముందే..

- జోరందుకున్న సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం
- భిక్కనూరులో నేతల హడావుడి



భిక్కనూరు జీపీ కార్యాలయం

భిక్కనూరు : సర్పంచ్ ఎన్నికల నోటిపికేషన్ రాక ముందే మండల కేంద్రమైన భిక్కనూరు సర్పంచ్ పోటీకి బరిలో ఉండాలనుకుంటున్న అభ్యర్థులు కొందరు ప్రచారాన్ని మొదలు పెట్టేశారు. కులసంఘాల నేతలను మహిళా సంఘాల నేతలను పలు పార్టీల నేతలను కార్యకర్తలను కలిసి తమకు మద్దతివ్వాలని కోరుతున్నారు. అయితే అభ్యర్థులు ఒంటరిగానే తిరుగుతూ తమకు మద్దతివ్వాలని పలువురిని కోరుతున్నారు. దీంతో మండల కేంద్రంలో రాజకీయ వాతావారణం వేడెక్కిందని చెప్పొచ్చు. రిజర్వేషన్లు యథాతథంగా ఉంటాయని వార్తలు వస్తుండడంతో బీసీ అభ్యర్థులు జోరందుకున్నారు. గతంలో భిక్కనూరు సర్పంచ్ పదవి బీసీలకు రిజర్వ్ కాగా సర్పంచ్‌గా తున్కి వేణు ఎన్నికయ్యారు. ప్రస్తుతానికి భార్యభర్తలైన మాజీ ఎంపీపీ బల్యాల రేఖ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్‌లలో ఒక్కరు సర్పంచ్ పదవికి పోటీకి ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే మాజీ సర్పంచ్ తున్కి వేణు, మాజీ ఉప సర్పంచ్ బోడ నరేష్‌తో పాటు స.హ. చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్, న్యాయవాది లింగాల రాజబాబు గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు బోండ్ల సునీల్‌తో పాటు బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, మాజీ సర్పంచ్ బండి రాములు సతీమణి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బండి చంద్రకళ, బీజేపీ నాయకుడు గెరిగంటి నర్సింలుతో పాటు మరి కొందరూ సర్పంచ్ పదవకి బరిలో ఉండేందుకు అత్యుత్సాహం చూపుతున్నారు. తాము సర్పంచ్‌గా గెలిస్తే మండల కేంద్రం అభివృద్ధికి చేపట్టబోయే పనుల విషయమై హోటళ్ల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు వివరిస్తూ మద్దతు కోరుతున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీలు ఎలాగైనా భిక్కనూరు మండల కేంద్రం సర్పంచ్ పదవిని దక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఎన్నికల కోడ్ కూయకముందే సర్పంచ్ పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థుల ఉత్సాహంగా ముందుకు రావడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రచారం చేస్తున్న వారిని కొందరూ సర్పంచ్ సాబ్ అంటూ ఆట పట్టిస్తున్నారు. దీంతో సర్పంచ్ పదవికి బరిలో ఉన్న ఆశావాహులు తమను సర్పంచ్ అనడం కాదుకాని.. గెలిపించాలంటూ వేడుకుంటున్నారు. మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్ అనారోగ్యంతో ఉండటంతో ఆయన సతీమణి మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తాటిపాముల పద్మను సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిపేందుకు కొందరు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరలో 'డబుల్' ఇళ్ల కేటాయింపు



ఎల్లారెడ్డిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదేశాల మేరకు ఆర్డీవో గురువారం డబుల్ బెడ్‌రూంలను ఆయన పరిశీలించారు. డబుల్ బెడ్‌రూంలకు విద్యుత్ సరఫరా పనులు, డ్రెయినేజీ నిర్మాణం పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, పీఆర్ డీఈ గిరిధర్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులున్నారు. అనంతరం పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్ కుమార్, ప్రిన్సిపాల్ సావిత్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. రాజంపేట మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని పోతిమీరి గడ్డ తండాకు చెందిన కేలోత్ బన్య అనే వ్యక్తి బైక్‌పై తాడ్వాయి నుంచి కామారెడ్డి వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టిందన్నారు. తీవ్ర గాయాలపాలైన బన్యను చికిత్స నిమిత్తం 108లో కామారెడ్డికి తరలించినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ నిధుల ఉత్తర్వులను రద్దు చేయాలి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లాలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల భవనాలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి కేటాయించిన ఎమ్మెల్సీ నిధుల ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి మాట్లాడుతూ కామారెడ్డి, భిక్కనూరు, ఎల్లారెడ్డిలో పీఆర్‌టీయూ భవనాలకు ఎమ్మెల్సీ నిధులు రూ. 25 లక్షలు కేటాయించడం దారుణమన్నారు. వాటిని ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుభాన్‌సింగ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బదిలీ నిబంధన అమలు చేయాలి

కామారెడ్డి టౌన్ : కేజీబీవీలలో ఎనిమిదేళ్ల బదిలీ నిబంధన అమలు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గరిష్ట కాలపరిమితి నిబంధన లేకపోవడం వల్ల కొందరికి ప్రయోజకంగా ఉన్నా, 15ఏళ్ల నుంచి ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కనీస కాలపరిమితి రెండేళ్లు పెట్టినప్పటికి గరిష్టంగా ఎనిమిదేళ్లు పెడితే ఎక్కువ మంది ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి–ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం వెలుగు చూసింది. పట్టాలపై మృతదేహం ఉందని సమాచారం అందడంతో కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, ఇతర ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. కేసుమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

భీమ్‌గల్: మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన పొట్టోడి సోను అను మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గురువారం సోనుకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యు లు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లోను భీమ్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా పురుటి నొప్పులు ఎక్కువయ్యాయి. 108 సిబ్బంది అయిన ఈఎంటీ సురేందర్, పైలట్ రాంకుమార్ మహిళకు ప్రసవం చేసి తల్లీబిడ్డను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోను కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



నవీపేట: మండలంలోని హనుమాన్ ఫారం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లా బాసర మండలం కిర్గుల్‌కు చెందిన సగ్గు సాయన్న(74) మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మాక్లూర్ మండలం గుంజిల్లిలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి సగ్గు సాయన్న తన కొడుకు సుభాష్‌తో కలిసి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా హనుమాన్ ఫారం సమీపంలో వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సగ్గు సాయన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో పడి మరో వృద్ధుడు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు పోచారం ప్రధానకాలువలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని తాండూర్‌లో గురువారం చోటుచేసుకుంది. తాండూర్‌కు చెందిన గుట్టమీది రాజయ్య(60)బుధవారం రాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటికి వెళ్లి గురువారం ఉదయం వరకు తిరిగిరాలేదు. అతడి భార్య సత్తెవ్వ కొడుకు నర్సింలుతో కలిసి వెతుకగా గ్రామశివారులోని పోచారం ప్రధాన కాలువ బ్రిడ్జి వద్ద నీటిలో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన పిట్ల గోపాల్ (38) 2019 మే 22 న గజ్వేల్ నియోజకవర్గంలోని నాచారం సమీపంలో హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో అతడిని సంపంగి రవి అనే వ్యక్తి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. రవిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చగా, నేరం రుజువుకావడంతో జిల్లా జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు నిచ్చారు. సాక్ష్యాధారాలను ప్రవేశ పెట్టిన సీఐలు రామాంజనేయులు, సంతోష్‌కుమార్, వెంకట్, ఎస్సైలు అంజయ్య, వెంకటేశ్వర్లు, వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, సిబ్బంది శ్రీనివాస్, సతీశ్ గౌడ్, మురళిని ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లో అడవి పిల్లి మృతి

- చిరుత పులి మృతి అని ప్రచారం..
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు



అడవిపిల్లి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి: మెట్‌పల్లి రోడ్‌లోని రిజర్వ్ ఫారెస్ట్‌లో గురువారం అడవి పిల్లి(జంగ పిల్లి) కళేబరం లభ్యమైంది. పశు కాపరులకు కళేబరం కనిపించడంతో చిరుత పులిది అనుకుని అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన అధికారులు ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. ఆ కళేబరం చిరుత పులిది కాదని, జంగిల్ క్యాట్(అడవి పిల్లి)గా నిర్ధారించారు. కళేబరానికి పురుగుల పట్టాయని, అడవి పిల్లి వారం రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. అడవి పిల్లి చర్మం చిరుత పులిని చర్మాన్ని పోలి ఉండడంతో.. అడవి చిరుత పులి మృతి చెందిందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మృతి చెందింది చిరుత పులి కాదని, అడవి పిల్లి అని ఎఫ్ఆర్‌వో రవీందర్ తెలిపారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

దోమకొండ: మండలంలోని అంబారిపేటకు చెందిన దండుగుల రవి అనే వ్యక్తికి కువైట్‌లో డ్రైవింగ్ అవకాశం ఉందని, ఎక్కువ జీతం వస్తుందని మాయమాటలు చెప్పి మోసం చేసిన కేసులో నకిలీ ఏజెంట్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండ మండలం గొట్టిముక్కలకు చెందిన ఎరుకల మైసయ్య గతేడాది అంబారిపేటకు చెందిన దండుగుల రవి వద్ద రూ.లక్ష తీసుకుని కువైట్‌కు పంపించాడు. అక్కడ ఏజెంట్ చెప్పిన విధంగా పని లభించకపోవడంతో రవి కొన్ని రోజుల్లోనే తిరిగి వచ్చి తనకు జరిగిన మోసంపై దోమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు గువారం మైసయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొడుకు మరణాన్ని తట్టుకోలేక తండ్రికి గుండెపోటు

- వారం రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- బోధన్ మండలం బెల్లాల్‌లో విషాదం



సాయికుమార్ (ఫైల్)



దేవర్ల వెంకటేశ్ (ఫైల్)

బోధన్‌రూరల్: కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి గుండెపోటుతో మృతి చెందిన విషాదకర ఘటన బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దేవర్ల వెంకటేశ్, శశికళ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. వారి చిన్న కొడుకు దేవర్ల సాయికుమార్ (22) ఈ నెల 18న రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమంలో మొక్కు చెల్లించుకోవడానికి స్నేహితుడితో కలిసి వెళ్లాడు. గోదావరి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి సాయికుమార్ మృతి చెందాడు. కొడుకు మృతి చెందిన నాటి నుంచి దిగాలుగా ఉంటున్న తండ్రి వెంకటేశ్‌కు బుధవారం అర్ధరాత్రి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా గురువారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందాడు. గురువారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. వారం రోజుల వ్యవధిలో తండ్రీకొడుకులు మృతి చెందడడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

తల్లిని చంపిన వ్యక్తిపై హత్యాయత్నం..

కామారెడ్డి క్రైం: తన తల్లిని చంపిన వ్యక్తిపై పగ పెంచుకున్న కొడుకు సదరు వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కామారెడ్డిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మాచారెడ్డి మండలం లక్ష్మీరావుల పల్లి గ్రామానికి చెందిన పల్లెపు నర్సింలు 2021లో జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన కాకర్ల బాలమణిని హత్య చేశాడు. దీంతో మృతురాలు బాలమణి కొడుకు వికాస్ నర్సింలుపై కక్ష పెంచుకున్నాడు. కామారెడ్డి పాత బస్టాండ్ వద్ద గురువారం కనిపించిన నర్సింలును బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని ఆర్‌బీ నగర్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ చేతులు కట్టేసి కర్రలు, రాళ్లతో దాడి చేశాడు. స్థానికులు గమనించి నర్సింలును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింలు

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



భిక్కనూరు: అప్పుల బాధ కారణంగా టోల్ ప్లాజాలో పని చేస్తున్న మండలంలోని రామేశ్వర్‌పల్లికి చెందిన ఏనుగు సంతోష్‌రెడ్డి (39)ఈనెల 20వ తేదీన తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఎల్లారెడ్డి పేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఇంట్లో నుంచి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన సంతోష్‌రెడ్డి 15నిమిషాల తర్వాత కుమార్తె సంజనకు ఫోన్ చేసి.. అప్పుల బాధ ఎక్కువైందని తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని తెలిపాడు. ఆమె వెంటనే తమ బంధువైన ఏలేటి మోహన్‌రెడ్డికి తెలుపగా, వారు వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలించారన్నారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తపల్లి తండాకు చెందిన యువకుడు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అప్పులు తీర్చే మార్గం లేక పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన ప్రకాశ్(23) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. మండలంలోని కొత్తపల్లితండాకు చెందిన మలావత్ ప్రకాశ్ ఈనెల 17న తన ఇంట్లో పురుగుల మందు తాగగా, స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి ప్రకాశ్ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.